సాక్షి తిరుపతి

బుధవారం । 24 । జనవరి । 2024



అతివలకు ఆర్థిక ఆసరా

మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. - 10లో



కళలను విశ్వవ్యాప్తం చేద్దాం

భారతీయ కళలను విశ్వవ్యాప్తం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి పిలుపునిచ్చారు. - 10లో



గజ దొంగల అరెస్ట్

తిరుపతి నగరంలో ఇద్దరు గజ దొంగలను చాకచక్యంగా అరెస్ట్ చేసినట్టు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,568 మంది స్వామివారిని దర్శించుకోగా 22,084 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీసిటీ విభిన్న పరిశ్రమలకు నిలయం



శ్రీసిటీలో సహకార సభ్యుల బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఏపీ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్యకు చెందిన 30 మంది సభ్యుల ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. ఆ సంస్థ చైర్మన్ ప్రకాశం యాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ దామోదర్ నాయుడు నేతృత్వంలో సందర్శించిన సభ్యులకు శ్రీసిటీ జనరల్ మేనేజర్ (ప్రభుత్వ సంబంధాలు) బీ.భగవాన్ సాదర స్వాగతం పలికారు. విభిన్న పరిశ్రమలకు నిలయమైన శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని నేరుగా వీక్షించి పలు అభివృద్ధి అంశాలు తెలుసుకోవడమే తమ పర్యటన ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. శ్రీసిటీలో ఏర్పాటైన మౌలిక వసతులు, ప్రగతి, ప్రత్యేకతల గురించి వారు తెలుసుకున్నారు. .

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: నేటి తరానికి ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ అని, ఆయన్ను రోల్‌మోడల్‌గా చేసుకుని ముందుకు సాగాలని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సెనెట్‌హాల్‌లో తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. ఆయనను స్మరించుకుంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 206 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడం శుభపరిణామని పేర్కొన్నారు. మాజీ ఎస్వీ పాలకమండలి సభ్యులు మధు, అంజయ్య, నాగేంద్ర, వర్సిటీ అధికారులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ వర్గాల నాయకులు

380 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

– మార్చి 31 వరకు దరఖాస్తుకు గడువు



సతీష్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఈడీ

తిరుపతి అర్బన్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లాకు 380 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేసినట్టు ఈడీ సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఈ పథకం ద్వారా రూ.90 లక్షల రాయితీలను చిరు వ్యాపారులకు అందించినట్లు వెల్లడించారు. ఒక్కో యూనిట్‌కు రూ.30 లక్షల చొప్పున మంజూరు చేస్తారన్నారు. అందులో 35 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. లబ్ధిదారు యూనిట్ కాస్ట్‌లో 10 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ ఏడాది రూ.2 కోట్లకు పైగా రాయితీలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు అర్హులని, ఈ నెల 31 వరకుదరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పరిశ్రమల తాలూకా అడ్రస్ ప్రూఫ్, వాటర్ బిల్, కరెంట్ బిల్, గ్యాస్ బిల్ తదితర కాపీలను అందించాలని సూచించారు. ప్రధానంగా బియ్యం, మామిడి, జీడిపప్పు, పసుపు, మిరపకాయలు, చిరుధాన్యాలు, కందులు, మినుములు, నువ్వులు, సన్‌ఫ్లవర్, ధనియాలు, అల్లం, బేకరీ, స్నాక్స్, అటవీ ఉత్పత్తులు, పాలు, చేపలతో పాటు సముద్ర ఉత్పత్తులు, చింతపండు, పుట్టగొడుగులు తదితర ఉత్పత్తుల వ్యాపారాలకు చెందిన యూనిట్లు మంజూరు చేస్తారని వివరించారు.

నేడు సీఎం వైఎస్ జగన్ రాక

- ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరుకానున్న ముఖ్యమంత్రి
- పటిష్ట ఏర్పాట్లు చేపట్టిన యంత్రాంగం





రేణిగుంట విమానాశ్రయంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట/తిరుపతి అర్బన్: తిరుపతి పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విచ్చేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. చిన్నపాటి లోపాలు లేకుండా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ శుభం భన్సల్‌తో కలసి మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో ఏఎస్ఎల్(ముందస్తు భద్రత లైజన్) సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం తిరుపతి తాజ్ హోటల్‌లో నిర్వహించే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొంటారన్నారు. సాయంత్రం 4.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన 4.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమానంతరం అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నట్లు ఆయన వివరించారు. సీఎం పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్పీ విమలకుమారి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుమతి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్



విజయవంతంగా ట్రయల్ రన్, ఏఎస్ఎల్

తిరుపతి క్రైం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటించనున్న ప్రాంతాలలో నిర్వహించిన ట్రయల్ రన్ సక్సెస్ అయినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరగబోయే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి కి భద్రతలో భాగంగా నిర్వహిస్తున్న ఏఎస్ఎల్, కాన్వాయ్ ట్రైల్ రన్ మంగళవారం విజయవంతంగా నిర్వహించినట్టు ఆయన వెల్లడించారు.



అయోధ్యలో టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి

బాలరాముడే వచ్చి నిలబడ్డట్టుంది

- తరతరాల కోరిక సాకారమైంది
- అయోధ్య రాముడి ప్రాణప్రతిష్టలో పాల్గొనడంతో నా జన్మధన్యమైంది
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: రామ జన్మభూమి అయోధ్యలో బలరాముడే వచ్చి నిలబడినట్టుందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. టీటీడీ ప్రతినిధిగా బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో పాల్గొని, దర్శించుకున్న ఆయన అయోధ్యలో తిరుమల నుంచి తీసుకెళ్లిన లక్ష లడ్డూలను వితరణ చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఆ భగవంతుడ్ని దర్శించడం గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. తరతరాల కోరికగ సాకారమైందన్నారు. విగ్రహ రూపంలో రాముడే అయోధ్యకు మళ్లీ దిగివచ్చినట్టుగా అనిపించిందన్నారు. రామాలయ నిర్మాణం హిందువులందర్నీ ఏకంచేసిందని తెలిపారు.

ప్రపంచమంతా పులకించింది

దేశంలోని రామ భక్తులను, ప్రపంచంలో ఉన్న హిందువులను రామాలయం ఏకం చేసిందని టీటీడీ చైర్మన్ కొనియాడారు. రామనామ జపంతో ప్రపంచమంతా పులకించిందన్నారు. ప్రపంచంలో దోపిడీ రహిత రాజ్యాన్ని నిర్మించడానికి రామమందిరం గొప్ప సంకేతమని చెప్పారు. శ్రీవారి కృపాకటాక్షం వల్ల తాను టీటీడీ అధ్యక్షుడిగా, సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో టీటీడీ ప్రతినిధిగా రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. త్రేతాయుగపు రాముడే...కౌసల్య కడుపులో పుట్టి ఆ తరువాత బాలరాముడిగా వచ్చి మందిరంలో నిలబడ్డట్టుగా ఉందన్నారు.

పింఛన్ ఆనందం పెంచెన్

ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. నాయకుడంటే ఇలా ఉండాలని నేటి తరానికి చాటిచెప్పారు. 2019 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతూ అవ్వాతాతల మోములో ఆనందం నింపారు. జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు చేర్చి వయసుడిగి, రెక్కలాడని అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారు. ఒంటరి మహిళలు, వితంతువులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.



తిరుపతిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

తిరుపతి నియోజకవర్గంలో పింఛన్ వివరాలు

	లబ్ధిదారులు	చెల్లిస్తున్న మొత్తం
డిసెంబర్ వరకు పింఛన్‌లు పొందిన వారు	19,556	రూ.5,95,88,500
కొత్తగా మంజూరైనవి	190	రూ. 50,00,000
మొత్తం లబ్ధిదారులు	19,746	రూ.6,45,88,500

ఈ ఏడాది నుంచి చెల్లిస్తున్న పింఛన్ (ఒక్కో లబ్ధిదారుకు) రూ.3,000



పేదల పెద్ద కొడుకు సీఎం వైఎస్ జగన్

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంపు
- ప్రతి మూడునెలలకోసారి కొత్త పింఛన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తిరుపతి తుడా: మాటంటే మాటే. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అధినేత హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతానని పాదయాత్ర సాక్షిగా పేదలకు మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం పింఛన్ల పెంపుపై చేసి మన్ననలు అందుకున్నారు. ఆ తర్వాత ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతూ జనవరి నుంచి రూ.3వేలకు చేర్చారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో ఈనెల పింఛన్ మొత్తం రూ.6,45,88,500ను పంపిణీ చేశారు.

నాడు ఎవరో ఒకరు చనిపోతేనే పింఛన్

గతంలో పింఛన్ మంజూరు కావాలన్నా, పింఛన్ నగదు తీసుకోవాలన్నా నరకం కనిపించేది. టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు, నిర్దేశించిన ప్రదేశంలో బారులు తీరిన క్యూల్లో నిరీక్షణలతో అవస్థలు పడాల్సి వచ్చేది. వీటన్నిటినీ మించి జన్మభూమి కమిటీల ఆమోదం పొందాలంటే తలప్రాణం తోకకొచ్చేంత పనయ్యేది. వయసుడిగినా ఇంట్లో ఎవరో ఒకరు చనిపోతేగానీ కొత్త పింఛన్ మంజూరయ్యేది కాదు.

నేడు అర్హత ఉంటే ఇంటికే పింఛన్

అర్హత కలిగిన లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గౌరవ ప్రదంగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామున 3 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదలవుతోంది. తలుపుతట్టి అవ్వా.. ఇదిగో పింఛన్ అంటూ వార్డు వలంటీర్లు సకాలంలో అందజేస్తున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. అర్హతకు కులం, మతం, పార్టీలు అన్న తారతమ్యం లేదు. సచివాలయ సిబ్బంది ద్వారా ఎంపిక చేస్తుండడంతో నిజమైన అర్హులకు న్యాయం జరుగుతోంది. అర్హులైన ఉండి ఒకవేళ సాంకేతిక కారణాల చేత పింఛన్ పొందని వారికి మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. ప్రతి ఏటా జూన్, డిసెంబర్‌లో కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్ కార్డు మంజూరు చేస్తున్నారు.



తొలిసారి పింఛన్ అందుకున్నా



జగనన్న ప్రభుత్వంలో తొలిసారి పింఛన్ అందుకోవడం సంతోషంగా ఉంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు నేను అర్హత సాధించడంతో మూడు వేలు పింఛను అందుకున్నా. పింఛన్ ఎంపిక కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. వార్డ్ వలంటీర్, వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా ఎంపిక చేశారు. రాజకీయాల్లో జగనన్న అరుదైన వ్యక్తి.

-ఏ.బాలయ్య, చెన్నారెడ్డి కాలనీ, తిరుపతి

చాలా సంతోషంగా ఉంది



ఇటీవల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. అన్ని పరిశీలించాక మంజూరు చేశారు. అర్హత సాధించడంతో ఈ నెల తొలిసారిగా పింఛన్ తీసుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. పిల్లల పెంపకం బాధ్యత కూడా నాపైనే పడింది. ఇంట్లో అవసరాలకు ఈ పింఛన్ ఎంతగానో ఉపయోగపడింది. ఉద్యోగి జీతం లాగా నాకు ఇకపై ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ అందుకుంటాను. - జీ.జ్యోతి, శివజ్యోతినగర్, తిరుపతి

దేవుడిచ్చిన కొడుకు



జగన్ బాబు నాకు దేవుడిచ్చిన కొడుకు. నాలాంటి అందరి ఆశీస్సులు జగన్‌కే ఉంటాయి. చల్లగా ఉండాలి. నూరేళ్ల పాలించాలి. గతంలో రూ.200 పింఛన్ కోసం రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లేదాన్ని. లేదా నా కొడుకు స్కూటర్లో వెళ్లేదాన్ని. ఎన్నో ఇబ్బందులు పడేదాన్ని. ఇప్పుడు ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. నా బిడ్డ జగన్ సంపాదనలో నా కోసం కొంత పంపిస్తున్నట్లు ఉంది. - సావిత్రమ్మ, భవానీనగర్

ఒకటో తేదే పింఛన్



ప్రతినెలా ఒకటవ తేదీనే తెల్లవారేసరికి తలుపు తట్టి అమ్మా పింఛన్ ఇదిగో అంటూ అందిస్తున్నారు. పింఛన్ అర్హత కోసం వలంటీర్ వద్ద ఆధార్ కార్డు ఇచ్చిన 21 రోజులకే పింఛన్ మంజూరైంది. ఎవరి వద్దకీ తిరగకుండానే పింఛన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. జగన్ బాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్‌ను అందిస్తున్నందుకు ఆయన రుణం తీర్చుకుంటాం.

-ఎం.పద్మావతి, జర్నలిస్ట్ కాలనీ, తిరుపతి

ఒక్క రోజులోనే పింఛన్



కోవిడ్ మహమ్మారి కారణంగా నా భర్త మృతి చెందాడు. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి మా కుటుంబ వివరాలు సేకరించారు. ఆ మరుసటి రోజే పింఛన్‌కు ఎంపికైనట్టు మంజూరు పత్రాన్ని అందజేశారు. మరుసటి నెల నుంచి పింఛన్ మంజూరవుతోంది. ఇప్పుడు పెరిగిన పింఛన్ రూ.3 వేలు నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. జగనన్న సహాయం నా కుటుంబం ఎప్పుడూ మరిచిపోదు.

-ఎస్.పద్మావతి, అంబేడ్కర్ కాలనీ, తిరుపతి

గతంలో ఎన్నో అవస్థలు



గతంలో రూ.250 పింఛన్ కోసం పరుగులు పెట్టేవాళ్లం. ఒకో నెల ఒక్కో ప్రాంతంలో పింఛన్ ఇచ్చేవాళ్లు. ఆటోలో వెళ్లి గంటల తరబడి కూర్చుని ఎదురుచూసే దాన్ని. తీరా ఈరోజు కాదు రేపు రండి అని వెనక్కి పంపించేవాళ్లు. మళ్లీ మరుసటి రోజు అదే తతంగం. ఇప్పుడు నా బిడ్డ జగన్ సీఎం అయ్యాక ఇంటికే వచ్చి గౌరవంగా పింఛను ఇస్తున్నారు. నిద్రలేపి అవ్వా..! పింఛన్ తీసుకో అంటూ వలంటీర్ మా ఇంటికి వచ్చి నెల జీతంలా అందిస్తున్నారు.

- లక్ష్మమ్మ, తాతయ్యగుంట, తిరుపతి

అంగన్‌వాడీల సంబరాలు

– సంబరాలు చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది



గూడూరులో కేక్ తినిపిస్తున్న అంగన్‌వాడీలు

చిల్లకూరు: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వం వరాలు ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంతో మంగళవారం గూడూరు నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం చిన్న పిల్లలు, గర్భిణులకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం అందజేశారు. గూడూరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుని, తమ కోర్కెలు అంగీకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సానుకూలంగా స్పందించారు



సమ్మె సమయంలో మమ్మల్ని కష్ట పెట్టినప్పటికీ చివరికి మమ్మల్ని తోబుట్టువులుగా భావించి, మా కోర్కెలు తీర్చడంతో పాటు, మాపై పెట్టిన కేసులను ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంతో సంతోషంగా ఉంది.

- ఇంద్రావతి, రూరల్ అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం

62 ఏళ్లు చేయడం సంతోషం



ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మా సర్వీసును కూడా 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అలాగే చనిపోయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల దహన ఖర్చులకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. మా కేసులు ఎత్తి వేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది.

- ప్రభావతి, రూరల్ కార్యదర్శి

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



చంద్రగిరిలో పిల్లల సంరక్షణలో కార్యకర్త

తిరుపతి అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. గత డిసెంబర్ 12 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెబాటపట్టారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయడంతో జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 2,492 అంగన్‌వాడీ కేంద్రాలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి మాట్లాడుతూ ఆయా ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లను సమన్వయం చేసుకుని సరుకులు ఏమైనా మిగిలి ఉంటే చెడిపోకుండా పంపిణీ చేయాలని సీడీపీఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు.

28న కోటలో సాధికార బస్సుయాత్ర



నాయకులతో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

కోట: కోటలో ఈ నెల 28న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. మంగళవారం కోటలో ఆయన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాసంలో నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు అన్నీ వర్గాల ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గాం. దీబొమ్మ సెంటర్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ రమణయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, నాగూర్‌రెడ్డి, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

28న టూరిజం రిసార్ట్స్ ప్రారంభం



ప్రారంభానికి ముస్తాబవుతున్న పున్నమి రిసార్ట్స్

తడ: మండలంలోని బీవీపాళెం గ్రామం, పులికాట్ తీరంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ వారు నిర్మించిన పులికాట్ లేక్ వ్యూ రిసార్ట్స్ ఈనెల 28వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి టూరిజం మంత్రి ఆర్కే.రోజా ముఖ్యఅతిథిగా హాజరై రిసార్టులను ప్రారంభించనున్నారు. మొత్తం 15 రిసార్టులు ఉన్న ఈ లేక్ వ్యూలో 10 రిసార్టులు పూర్తిచేశారు. వీటిని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

ఆనం మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్‌: వెంకటగిరిలో ఇక ఆనం రామనారాయణరెడ్డి మాటలు ఇక చెల్లుబాటు కావని, ఆయన మాయ మాటలు నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త ప్రజలకు హితవు పలికారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో రాజకీయ అనుభవం అని చెప్పుకుంటున్న ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలో అభివృద్ధి ఆలోచన లేకుండా అరాచకాలకు పాల్పడి కొత్త మార్గలను ఎంచుకున్నారని విరుచుకుపడ్డారు. వెంకటగిరిలో అభివృద్ధి చేసింది వెంకటగిరి రాజా కుటుంబీకులు, మాజీ ముఖ్యమంత్రి, మంత్రి తమ తల్లిదండ్రులు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, రాజ్యలక్ష్మమ్మలు అని గుర్తుచేశారు. వారి అడుగు జాడల్లోనే నేడు వెంకటగిరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు ఆయన వెల్లడించారు. ఇప్పటికే జగనన్న కాలనీ ఎదురుగా ఉన్న 110 ఫారెస్ట్‌ భూమిలో నగరవనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 76 వేల కుటుంబాల వద్దకు వెళ్లానని, వారందరి సమస్యలు తెలుసుకున్నానని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే తన ముందున్న లక్ష్యమని తెలిపారు. సమావేశంలో పట్టణ కన్వీనర్‌ జీ.ఢిల్లీబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ దొంతుశారద, పద్మశాలికార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ నక్కా వెంకటేశ్వరరావు, న్యాయవాది ఎల్‌.కోటేశ్వరరావు, విప్‌ పీ.లక్ష్మి, వైస్‌చైర్మన్‌ ఎస్‌.బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు మాడా జానకీరామయ్య, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, వహిద, కందాటి కళ్యాణి, ధనియాలరాధ, నాయకులు రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, సీహెచ్‌ మురళి, యస్థాని పాల్గొన్నారు.

అతివలకు ఆర్థిక ఆసరా

- అట్టహాసంగా ఆసరా నాల్గో విడత కార్యక్రమం
- జిల్లాలో 31,90,49 మందికి రూ.298.67 జమ
- కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి



మెప్మా అర్బన్‌ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న నేదురుమల్లి



ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం (వెంకటగిరి): మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్‌ భవనంలో మంగళవారం వైఎస్సార్‌ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్‌ మార్కెట్‌ను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్‌ ప్రారంభించారు. పొదుపు గ్రూపుల ద్వారా మహిళలు చేస్తున్న వ్యాపారాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మహిళా ఆర్థికంగా ఉండే దిశగా సీం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చెప్పిన విధంగా మహిళలకు 4వ విడత ఆసరా నిధుల కింద జిల్లా పరిధిలో 31,90,49 మంది లబ్ధిదారులకు రూ.298.67 కోట్లు జమచేసినట్టు తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటాం

అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహిళలు అన్నీ రంగాల్లో రాణించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అనంతరం సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌ ఆసరా లైవ్‌ కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించారు. తదనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఆసరా మెగా చెక్కును అందజేశారు. డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, లీడ్‌బ్యాంకు మేనేజర్‌ సుభాష్‌, పట్టణ కన్వీనర్‌ ఢిల్లీబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ దొంతుశారద, విప్‌ పూజారిలక్ష్మి, వైస్‌ చైర్మన్లు ఎస్‌.బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మూడు గేదెలు కొన్నాను



నేను వినాయక పొదుపు సంఘంలో సభ్యురాలిని. నేను గేదెలనుకొని వాటి ద్వారా వచ్చిన పాలతో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. గతంలో ఒక గేదె ద్వారా వచ్చిన పాల ఆదాయం నా కుటుంబ ఖర్చులకు సరియేది కాదు. వైఎస్సార్‌ ఆసరా పథకం ద్వారా లబ్ధి పొందిన సొమ్ముతో ఇప్పుడు మూడు గేదెలను కొన్నాను. రోజూ 10 లీటర్ల పాలు విక్రయిస్తున్నాను.

– రమణమ్మ, వెంకటగిరి

జగనన్నకు ధన్యవాదాలు



నేను వెంకటేశ్వర సంఘంలో సభ్యురాలుగా ఉన్నాను. చెప్పుల షాపు ద్వారా వచ్చిన ఆదాయం పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు సరిపోయేది. ఇప్పుడు వైఎస్సార్‌ ఆసరా, జగనన్నతోడుతో నా చెప్పుల వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. మాకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన వంటి పథకాలు వస్తున్నాయి. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు

– మంజుల, వెంకటగిరి



ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, అధికారులు



సమావేశానికి హాజరైన పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు

హోటల్‌ నిర్వాహకులపై దాడి

చంద్రగిరి: హోటల్‌ నిర్వాహకులపై దాడికి పాల్పడడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు.. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ, పాకాలవారిపల్లికి చెందిన సారథి, అలేఖ్య దంపతులు టోల్‌ ప్లాజా వద్ద హోటల్‌ నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రభుత్వ వాహనం బోర్డుతో బొలెరోలో హోటల్‌ వద్దకు చేరుకున్న డ్రైవరు 'సార్‌ వస్తున్నారు.. వెంటనే టేబుల్‌ క్లీన్‌ చెయ్యండి'అంటూ గదమాయించి మాట్లాడారు. ఇప్పటి కే రాత్రి 11 గంటలయ్యింది, హోటల్‌ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు డ్రైవరుకు తెలిపారు. వాహనంలో ప్రభుత్వ ఉద్యోగి అని చెప్పుకునే వ్యక్తి హోటల్‌ వద్దకు వచ్చి దౌర్జన్యం చేశాడని బాధితురాలు వాపోయారు. దుకాణంలో నిద్రిస్తున్న అలేఖ్య భర్త సారథి అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పే క్రమంలో దుర్భాషలాడడంతో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగి అని చెప్పుకునే వ్యక్తి ఫోన్‌ చేసి మరికొంత మందిని పిలించాడని, రెండు కార్లలో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు తన భర్త తలపై బీరు బాటిల్‌తో దాడి చేసినట్లు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ కళలను విశ్వవ్యాప్తం చేద్దాం



మాట్లాడుతున్న జేఈవో సదాభార్గవి



డిప్లొమో కోర్సు పూర్తి చేసుకున్న వారికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందిస్తున్న జేఈవో

తిరుపతి(అలిపిరి): సంగీత, నృత్య కళలను విశ్వవ్యాప్తం చేసి భవిష్యత్తు తరాలకు అందించాలని జేఈవో సదాభార్గవి పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలోని ఎస్వీ సంగీత నృత్య కళాశాలను ఆమె పరిశీలించారు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతో టీటీడీ తరతరాలుగా పూర్వీకులు అందించిన ప్రాచీన కళలకు ప్రాణంపోస్తున్న గొప్ప సంస్థ అని, సంగీతం, నృత్యం అతి కష్టమైనా మనస్సుకు దగ్గరగా ఉన్న విద్య అన్నారు. ఎంతో చరిత్ర ఉన్న సంగీత, నృత్య కళాశాల, విశ్వవిద్యాలయం స్థాయికి చేరుకోవడానికి అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ స్కాలర్‌షిప్‌ రూపంలో రూ.లక్ష అందిస్తోందని గుర్తుచేశారు. శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వెనుక ఉన్న పాత టీటీడీ పరిపాలనా భవనంలో సంగీత, నృత్య మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం రూ.11 కోట్లతో నూతన హాస్టల్‌ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కళాశాలలో వజ్రోత్సవాలు వారం రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పురాతన కళలు కాపాడాలి

సీఈవో శేషశైలేంద్ర మాట్లాడుతూ వేదాలలో ఉన్న పురాతన కళలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భారతదేశం భరతనాట్యం, కూచిపూడి తదితర నాట్యాలు సంగీత వాద్య కళల సమూహమన్నారు. కళాశాల స్థాయిలోనే అష్టాదశ ప్రాజెక్ట్‌ రావడం గొప్ప విషమన్నారు. అనంతరం ఎస్వీ డోలు, నాదస్వరం పాఠశాలలో ఆరేళ్ల డిప్లొమో కోర్సు పూర్తిచేసిన 19 మంది విద్యార్థులకు రూ.లక్ష గౌరవ పారితోషికాన్ని జేఈవో అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు జేఈవో, ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్‌ ఉమాముద్దుబాల తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


తడ: తడ రైల్వే స్టేషన్‌ సమీపంలో మంగళవారం రైలు పట్టాలు దాటుతున్న సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తిని రామేశ్వరం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్‌పీ ఇన్‌చార్జ్‌ ఎస్‌ఐ కే.కొండపనాయుడు కథనం.. రైలు పట్టాలపై గుర్తుతెలియని మృత దేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బందికి చెన్నై వెళ్లే మార్గంలో తల, మొండెం వేరుగా పడి ఉన్న స్థితిలో మృత దేహం కనిపించింది. మృతుడు నలుపు రంగు జీన్స్‌ ప్యాంట్‌, నలుపు, పింక్‌ కలర్‌ చిన్నచిన్న గళ్లు కలిగిన పొడవు చేతుల షర్టు ధరించి ఉన్నాడు. ఇతని వద్ద నల్లటి హెచ్‌పీ కంపెనీ ల్యాప్‌టాప్‌ బ్యాగ్‌ మాత్రమే ఉంది. అందులో లోదుస్తులు మినహా మరెలాంటి ఆధారం లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేటకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బావిలో పడి మహిళ మృతి

తిరుపతి రూరల్‌: మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన తిరుపతి రూరల్‌ మండలం, చెర్లోపల్లికి చెందిన వాణి(45) మంగళవారం గ్రామానికి సమీపంలోని బావిలో శవమై తేలింది. రూరల్‌ ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు... చెర్లోపల్లికి చెందిన వాణి మతిస్థిమితం లేని కారణంగా ఈ నెల 20వ తేదీ ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. రెండు రోజుల పాటు కుటుంబ సభ్యులు, బంధువులు వెదికినా ఎక్కడా కనిపించలేదు. వాణి మిస్సింగ్‌పై ఈనెల 22ను రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. మంగళవారం గ్రామానికి సమీపంలోని ఓ బావిలో వాణి శవమై కనిపించడంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తులు పరిశీలించిన తర్వాత వాణి మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అమ్మ దగ్గరకు వస్తూ.. అనంతలోకాలకు!

– బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు మహేష్‌

తిరుపతి రూరల్‌: బతుకుదెరువు కోసం బెంగళూరు వెళ్లి అనారోగ్యంతో ఉన్న అమ్మను పలకరిద్దామని వస్తూ.. బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున తిరుపతిలో చోటుచేసుకుంది. రూరల్‌ ఎస్‌ఐ పూర్యానాయక్‌ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్‌ మండలం, వేదాంతపురానికి చెందిన మహేష్‌(35) బతుకు దెరువు కోసం భార్య, బిడ్డలతో కలిసి బెంగళూరు వెళ్లాడు. వేదాంతపురంలో ఉంటున్న అమ్మకు ఆరోగ్యం బాగాలేదని సమాచారం రావడంతో సోమవారం రాత్రి బెంగళూరు నుంచి వేదాంతపురానికి బయలుదేరాడు. గ్రామానికి సమీపంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఉన్న ఆర్సీ పురం సర్కిల్లో బస్సు దిగాడు. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బస్సు మహేష్‌ను ఢీకొట్టింది. అర్ధరాత్రి మూడు గంటల సమయంలో రక్తగాయాలతో రోడ్డుపై ఉన్న మహేష్‌ను తిరుపతి రూరల్‌ పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 6 గంటలకు మహేష్‌ మృతిచెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమి ఆక్రమించి.. ఆపై దౌర్జన్యం చేసి



ఆర్‌ఎస్‌ డీటీ సుబ్బయ్యకు వినతి పత్రం అందిస్తున్న బాధితులు

కేవీబీపురం: వృద్ధుల భూమిని ఆక్రమించాడో ప్రబుద్ధుడు. ఆపై వారిపైనే దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన మండలంలోని అంజూరు పాళెంలో వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు వృద్ధ దంపతులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం.. అంజూరుపాళెం గ్రామానికి చెందిన మునస్వామి, ఆయన తల్లి మారియమ్మకు అదేగ్రామంలో సర్వే నం.264–10ఏ, 267–10లో సుమారు 1.50 ఎకరాల భూమి ఉంది. దీన్ని అదే గ్రామానికి చెందిన రమేష్‌ అనే వ్యక్తి ఆక్రమించాడు. దీనిపై మునస్వామి, అతని తల్లి అడ్డుచెప్పడంతో రమేష్‌ రెచ్చిపోయి వారిపై దౌర్జన్యానికి దిగాడు. ఈ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై తహసీల్దార్‌ శ్రీదేవిని వివరణ కోరగా వీఆర్‌ఓ ద్వారా తక్షణమే విచారించి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

గజదొంగల అరెస్ట్‌

- మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న చైన్‌ స్నాచర్స్‌
- వయసు పైబడిన వారే టార్గెట్‌
- జిల్లాలో 14కు పైగా దొంగతనాలు
- రూ.46.9 లక్షల విలువచేసే 803 గ్రాముల బంగారు, 900 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరమేశ్వర్‌ రెడ్డి



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైం: నగరంలో వయసు పైబడిన వారినే టార్గెట్‌ చేసి చైన్‌ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు గజ దొంగలను తిరుచానూరు పోలీసులు అరెస్ట్‌ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం.. చంద్రగిరి సబ్‌డివిజన్‌ డీఎస్పీ యశ్వంత్‌కుమార్‌ ఆధ్వర్యంలో తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డి వారి బృందాలతో ఇటీవల కాలంలో తిరుపతి నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు, చైన్‌ మ్యాచింగ్‌ ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల గురించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇదే క్రమంలో పక్కా సమాచారంతో మోస్ట్‌ వాంటెడ్‌ దొంగలైన పాపాన్ని క్రాంతికుమార్‌ అలియాస్‌ క్రాంతి, అతనికి సహకరిస్తున్న యమలం జ్ఞానేశ్‌కుమార్‌ అలియాస్‌ చంటిని రేణిగుంట 150 బైపాస్‌ రోడ్‌లో పోలీసులు చాకచక్యంగా అరెస్ట్‌ చేశారు. వీరిద్దరూ కూడా తిరుపతికి చెందిన వారేకావడం గమనార్హం. వారి వద్ద నుంచి 46 లక్షల 93,500 విలువచేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఇందులో 83 గ్రాముల బంగారు, 900 గ్రాములు వెండి, రాయల్‌ ఎన్ఫిల్డ్‌ మోటార్‌ సైకిల్‌, నాలుగు కిలోల గంజాయి, హోండా డ్రీం మోటార్‌ సైకిల్‌ ఉన్నట్టు వెల్లడించారు.

మూడేళ్లుగా చోరీలు

గత మూడు సంవత్సరాలుగా తిరుపతి నగరంలో తిరుగుతూ ఒంటరిగా తిరుగుతున్న వయసు పైబడిన మహిళలను టార్గెట్‌ చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారు. పిల్లలకు ట్యూషన్‌ చెప్తామని, బజాజ్‌ ఫైనాన్స్‌ నుంచి రికవరీకి వచ్చామని, అడ్రస్‌ వెరిఫికేషన్‌ అని రకరకాల మాటలు చెప్పి నమ్మించేవారు. అలా నమ్మిన అనంతరం వారి మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయేవారు. సదరు బంగారు ఆభరణాలను అమ్మగా వచ్చిన సొమ్మును జల్సాలకు ఖర్చు చేసేవారు. నర్సీపట్నం, విశాఖపట్నంలో గంజాయిని తక్కువ రేటుకు అమ్ముతారని తెలిసి అక్కడికి వెళ్లి గంజాయిని కొనుక్కొని, తమిళనాడు , చెన్నైలోని గుర్తుతెలియని వ్యక్తులకు అధిక ధరలకు విక్రయించేవారు.

జిల్లాలో 14కు పైగా కేసులు

సదరు ముద్దాయిలతోపాటు తిరుపతిలోని పలు పోలీస్‌ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు ఎస్పీ తెలిపారు. ఇందులో తిరుచానూరు పోలీస్‌ స్టేషన్‌లో–7, తిరుచానూరు–4, తిరుపతి రూరల్‌–6, అలిపిరి–1, ఎస్వీయూ క్యాంపస్‌ పోలీస్‌ స్టేషన్‌– 1 , ఈస్ట్‌ పోలీస్‌ స్టేషన్లో–1 కేసు నమోదైనట్టు తెలిపారు. ఈ కేసును చేదించడంలో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్‌, తిరుచానూరు సీఐ శివప్రసాద్‌ రెడ్డి ఎస్‌ఐ జగన్నాథ్‌ రెడ్డి, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు.